## ఆర్ఎఫ్‌సీఎల్ వార్షిక ఉత్పత్తి
# 11.19 లక్షల మెట్రిక్ టన్నులు



ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 1: రామగుండంలో నిర్మించిన ఆర్ఎఫ్‌సీఎల్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 11.19 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేసినట్లు ఆర్ఎఫ్‌సీఎల్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుధీర్‌కుమార్ ఝా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా ఉత్పత్తి సాధించడంలో కీలక పాత్ర పోషించిన కార్మికులకు, ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలోని 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా టార్గెట్‌గా పెట్టుకోగా, 11.19 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. అందులో తెలంగాణకు 4,45,861.89 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 1,53,383.94 మెట్రిక్ టన్నులు, కర్ణాటకు 1,83,070.44 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రకు 78,745.23 మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్‌కు 85,862.07 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 99,006.03 మెట్రిక్ టన్నులు, మధ్యప్రదేశ్‌కు 74,093.94 మెట్రిక్ టన్నుల చొప్పున సరఫరా చేసినట్లు చెప్పారు.



## సర్కార్ బడికి పంపించండి

ఆహ్లాదకరమైన ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్యతోపాటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఉచితంగా లభిస్తాయి. సర్కార్ బడిపై నమ్మకం ఉంచి మీ పిల్లలను పంపించండి అంటూ ధర్మారం మండలంలోని రచ్చపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం హెచ్ఎం వంశీమోహనాచార్యులు తోటి ఉపాధ్యాయులతో కలిసి వినూత్నంగా ప్రచారం చేశారు. ఉదయం ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో కల్పించే వసతులు, విద్య గురించి వివరించారు. **- ధర్మారం, ఏప్రిల్ 1**

## నాడు కేసీఆర్ పాలనలో కళ కళ



## నేడు కాంగ్రెస్ పాలనలో వెలవెల



ఈ చిత్రంలో కనిపిస్తున్న చెక్‌డ్యాం పెద్దపల్లి మండలం భోజన్నపేట-చీకురాయి గ్రామాల శివారులో ఉంది. కేసీఆర్ సర్కారు ₹49 కోట్లతో నిర్మించగా, కొన్నేళ్లుగా వాగొడ్డు రైతులకు ఆదరువుగా మారింది. గత ఫిబ్రవరిలో నీటితో కళకళలాడిన డ్యాం, నెల రోజుల వ్యవధిలోనే ఎడారిగా మారిపోవడంతో రైతన్న గుండె చెరువైంది. పంట చేతికందే దశలో ఉండడం, వాగులో నీరు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు ఇప్పటికే ఎండిన పంటలను వదిలేయగా, మరికొందరు నీటి కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. వాగులో నీటి కోసం గుంతలను తవ్వించి, నీటిని పారించేందుకు తండ్లాడుతున్నారు. **- పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 1**



మాట్లాడుతున్న కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

# గెలుపే లక్ష్యంగా పని చేయాలి

బోయినపల్లి, ఏప్రిల్ 1 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం బోయినపల్లిలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు మూడు నెలల్లోనే ప్రజలకు దూరమైందని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. యాసంగి పంటకు క్వింటాల్ ధాన్యానికి ₹500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు, నాయకులందరూ ఐక్యతతో కృషి చేసి కేంద్ర, రాష్ట్ర వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన పనులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రాజెక్టులతో జరిగిన మేలు గురించి గడపగడపకూ వెళ్లి వివరించాలని సూచించారు. అనంతరం బోయినపల్లిలో పెద్దమ్మ దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకుని, మత్స్య కార్మికులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అన్ని వర్గాలకు బాసటగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు చెన్నాడి అమిత్‌కుమార్, మండలాధ్యక్షుడు కొండయ్య, వైస్ ఎంపీపీ నాగయ్య, మాజీ ఎంపీపీలు సత్తినేని భాగ్యలత, మాధవ్ దంపతులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### ఎస్సారార్ జలాశయం పరిశీలన

బోయినపల్లి మండలం శాభాష్‌పల్లె వద్ద శ్రీరాజరాజేశ్వర జలాశయంలో నీళ్లు లేక తేలిన రోడ్డు, ఏర్పడ్డ పగుళ్లను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి వినోద్‌కుమార్ పరిశీలించారు. నడుచుకుంటూ తిరుగుతూ పరిస్థితిని గమనించారు. మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద చర్య లు తీసుకుంటే ఇంత దారుణ పరిస్థితి వచ్చేది కాదన్నారు. మూడు పిల్లర్లు కుంగాయన్న సాకుతో ప్రాజెక్టులను పట్టించుకోకపోవడం వల్లే పదేళ్లలో చూడని కరువు కాటకాలు ఈ ప్రభుత్వంలో చూస్తున్నామని చెప్పారు. మధ్యమానేరు నీళ్లలేక అడుగంటి పోయేది కాదని, వేసిన యాసంగి పంటలు ఎండిపోయే పరిస్థితే ఉండేది కాదన్నారు. ఇది కాలం తెచ్చిన కరవు కాదని, ముమ్మాటికి కాంగ్రెస్ సృష్టించిన కరువని ధ్వజమెత్తారు.

### పొలంలో పశువులను మేపుకుంటున్న

నేను మా ఊరి చెరువు కింద ఐదెకరాల్లో వరి వేసిన. అందులో రెండెకరాలు కౌలుకు తీసుకున్న. అధికారులు నీరిస్తమంటేనే ధైర్యంగా పెట్టుబడి పెట్టి పంట సాగు చేసిన. మొదట రెండుసార్లు ఇచ్చిన్రు. కొన్ని రోజుల్లోనే పంట చేతికత్తదని సంబుర పడ్డ. తీరా పంటలు చేతికి అచ్చే టైమ్‌లో నీళ్లు ఆపివేసిన్రు. సార్లకు మొరపెట్టుకున్న పట్టించుకోలె. దీంతో పంటలు ఎండి పోతున్నయ్. చేసేది ఏమి లేక ఐదు ఎకరాల్లో వరి పంట ఎండి పోయింది. దిక్కులేక పొలంలో పశువులను మేపుకుంటున్న.

**-రాచర్ల రమేశ్, రైతు (పుట్టపాక)**

# పశువుల మేతగా పొలాలు

- గోదావరి, మానేరు పరివాహక ప్రాంతాల్లో ఎండుతున్న పంటలు
- చేతికొచ్చే దశలో వదిలేస్తున్న రైతులు
- పదేండ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని ఆవేదన
- కాంగ్రెస్ సర్కారు తీరుపై ఆగ్రహం
- పరిహారం ఇవ్వాలని డిమాండ్

**ఎన్నడూ లేని విధంగా ఈ సారి సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. నిరుడు గళ గళ పారిన ఎస్సారెస్పీ కాలువలు ఈ యేడు వెలవెలబోతున్నాయి. చివరి దశలో ఉన్న పంటను కాపాడేందుకు రైతులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. వెరసీ మంథని డివిజన్‌లోని గోదావరి, మానేరు పరీవాహక ప్రాంతాల్లోని వేల ఎకరాల్లో నెర్రెలు బారిన పంట పొలాలు బర్రెలకు మేతగా మారుతున్నాయి.**



మంథని మండలం పుట్టపాకలోని తన పొలంలో బర్రెను మేపుతున్న రైతు రాచర్ల రమేశ్

మంథని, ఏప్రిల్ 1: మంథని డివిజన్‌లోని మంథని మండలం పుట్టపాక, చల్లపల్లి, మైదుపల్లి, కాకర్లపల్లి, సూరయ్యపల్లి, ఖానాపూర్, ఎక్లాస్‌పూర్, మంథని శివారు, మల్లేపల్లి, విలోచవరం, నాగారం, అక్కెపల్లి, సిద్ధపల్లి, ముత్తారం మండలంలోని సీతంపల్లి, రామకృష్ణాపూర్, రంగయ్యపల్లి, ఖమ్మంపల్లి, రామగిరి మండలంలోని రాజాపూర్, రామయ్యపల్లి, లద్నాపూర్, బేగంపేటతో పాటు పలు టేలాండ్ ప్రాంతాల్లోని రైతులు ఎస్సారెస్పీ డీ-83 కెనాల్, సబ్ కెనాళ్లపై ఆశలు పెట్టుకొని వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే ప్రారంభంలో రెండు తడులు మాత్రమే సాగునీరందించారు. కానీ, తర్వాత నీరివ్వక పోవడంతో సాగునీటి సమస్య మొదలైంది. మరోవైపు గోదావరి, మానేరు నదుల్లో నీటి ప్రవాహం లేక భూగర్భజలాలు గణనీయంగా పడి పోయాయి. చెరువులు, కుంటలు సైతం అడుగంటుతున్నాయి. గతానికి భిన్నంగా ఈ సారి కష్టాలు మొదలయ్యాయి. దీనికితోడు కరెంట్ ఇక్కట్లు వెంటాడుతున్నాయి. దీంతో వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. చేతికొచ్చే దశలో దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి వచ్చే దిక్కు లేక మనోవేదనకు గురవుతున్నారు. దిక్కుతోచని స్థితిలో దుఃఖాన్ని దిగమింగుకొని పొలాల్లో పశువులను తొలుతున్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు తలెత్తలేదని గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు అనాలోచిత విధానాలతోనే ఈ దుస్థితి దాపురించిందని భగ్గుమంటున్నారు. ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### లక్ష రూపాయలు లాసే



నేను మా ఊరి చెరువు కింద మూడెకరాల్లో వరి వేసిన. కెనాల్ నీళ్లు రాక దాదాపు నెల రోజులైతంది. దీంతో రెండెకరాల్లో పంట ఎండిపోయింది. ఎకరాకు రూ. 25వేలకు పైగా పెట్టుబడి పెట్టిన. అవన్నీ నీళ్ల పాలైనట్లే. కడుపు మండిన రైతులు ఎండిన పంటను చూడలేక బాధతో పశువులకు వదిలి పెడుతున్నరు. నేను రూ. లక్ష వరకు లాస్ అయినట్లే. తొమ్మిదేండ్లుగా మేము నీళ్ల కోసం, కరెంట్ కోసమైతే ఎదురు చూడలే, ఏ నీటైమ్ నీళ్లచ్చేది మాకు, బాధన్న ముచ్చటే లేకుండే. కానీ ఈ ఏడాదే మాత్రం నీళ్ల గోస అచ్చిపడింది.

**-సవాయి నాని, సల్లపల్లి (పుట్టపాక)**



సాగునీరు లేక గొలుసు దశలో ఎండి పోతున్న పొలం

### పశువులను మేపుకొమ్మంటున్నరు



పుట్టపాక-శ్రీరాంనగర్ గ్రామాల మధ్య సాగునీరు లేక వందల ఎకరాల్లో వరి పంటలు ఎండిపోయినయ్. దీంతో రైతులు పశువులను మేపుకొమ్మని చెప్పిన్రు. అయితే రైతులు కన్న బిడ్డల్లాగా పెంచుకున్న పొలాలను మేత కోసం వదిలి పెడుతున్న తీరు చూసి నాకు కూడా బాధేసింది. నేను కూడా రైతునే. రెండు ఎకరాల్లో సాగు చేసిన. గొలుసు వేసిన ఈ టైమ్‌లో కాలువ నీళ్లు రాక పంట పూర్తిగా ఎండి పోయింది. దాదాపు లక్షకు పైగా పెట్టుబడి, చేతి కష్టం పోయినట్లే. చివరికి రైతుల పొలాలతో పాటు నా ఎండిన పొలంలో కూడా నా మేకలను మేపుతున్న. సర్కారు పరిహారమిచ్చి ఆదుకోవాలె.

**-సలీం, మేకల కాపరి (పుట్టపాక)**



రంజన్ కొనుగోలు చేస్తున్న ప్రజలు

# పేదోడి ఫ్రిజ్ రంజన్

- ఎండపూట పెరుగుతున్న వినియోగం
- మట్టి కుండలకూ ఆదరణ

**వేసవిపూట పేదోడి ఫ్రిజ్ రంజన్‌కు ఆదరణ పెరుగుతున్నది. ఫ్రిజ్‌లు, వాటర్ కూలర్లలోని నీటి కన్నా.. మట్టిపాత్రల్లోని నీరు ఆరోగ్యదాయకం కావడంతో వీటికి డిమాండ్ ఉంటున్నది. ఎండలతోపాటే కొనుగోళ్లు పెరుతుండగా, తయారీదారుల్లో సంతోషం కనిపిస్తున్నది.**

జగిత్యాల, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ) : ఎండకాలం మొదలైందంటే చాలు.. ఏ ఇంటనైనా మట్టికుండనో, సురాయినో ఉండాల్సిందే. ఇది దశాబ్దం కిందటి మాట! కానీ, కాలక్రమేణా ఆధునీకరణ మోజుకు మట్టి పటువ ఆదరణ కోల్పోయింది. వీటి స్థానాన్ని ఫ్రిజ్‌లు, వాటర్ కూలర్లు ఆక్రమించాయి. మట్టి కుండలు, రంజన్లు, సురాయిలు కనుమరుగు కాగా, వీటి తయారీపై ఆధారపడ్డ వారు క్రమంగా ఇతర వృత్తులవైపు మళ్లాల్సి వచ్చింది. కానీ, కరోనా తర్వాత పరిస్థితిలో మార్పు మొదలైంది. ప్రతి ఒక్కరిలో ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ పెరిగి, పూర్వ పద్ధతుల ఆచరణపై ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా పూర్వకాలం నాటి పద్ధతుల్లో ఆహార, ఆరోగ్య రహస్యాలు దాగి ఉండడంతో మనుషులు మళ్లీ అటువైపు మళ్లుతున్నారు. కాటన్ దుస్తుల వినియోగం, రాగి, ఇత్తడి పాత్రల వినియోగం మొదలు పెట్టారు. ఫ్రిజ్, వాటర్ కూలర్లలో నిలువ చేసిన నీటిని తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని గుర్తించి, మళ్లీ మట్టి పాత్రలవైపు మొగ్గు చూపుతున్నారు. తాజాగా, వేసవి ప్రవేశం చినప్పటి నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రంజన్లను జోరుగా విక్రయిస్తున్నారు. ఆదిలాబాద్, కామారెడ్డి, వరంగల్‌తో పాటు ఎక్కువగా 'ఆదిలాబాద్ రంజన్లను అమ్ముతున్నారు. ఐదు లీటర్ల నుంచి ఇరవై లీటర్ల సామర్థ్యం ఉన్న రంజన్లు అందుబాటులో ఉంచుతున్నారు. కాలానికి అనుగుణంగా రంజన్లకు నల్లాలను (కొలాయిలు) కూడా అమర్చుతున్నారు. వేసవి మొదలైనప్పటి నుంచి నిత్యం పెద్ద ఎత్తున విక్రయాలు చేస్తున్నారు. గతంలో కుండలు, చిన్న,పెద్ద సురాయిలను అమ్మినా.. ఇప్పుడు వాటికి ఆదరణ లేక తయారీ దాదాపుగా నిలిచిపోయిందని అమ్మకందారులు చెబుతున్నారు. కేవలం రంజన్లను అమ్ముతున్నామని, ₹100 నుంచి మొదలుకొని ₹300 వరకు అందుబాటులో ఉన్నాయని అంటున్నారు. రంజన్లు, మట్టి కుండలతోపాటు, అన్నం వండుకునే పాత్రలను సైతం అమ్ముతున్నామంటున్నారు.

### ఫ్రిజ్ నీరు తాగితే ఆరోగ్య సమస్యలు



ఫ్రిజ్‌లు, నీటి కూలర్లు, ప్లాస్టిక్ డబ్బాల్లోని నీరు తాగితే గొంతు సంబంధ సమస్యలు వస్తున్నాయి. ఫ్రిజ్ నీళ్లు తాగితే దాహం తీరడం లేదు. అందుకే ఇప్పటికీ రంజన్‌లోని నీటినే తాగుతున్నాం. రంజన్ నీరు చల్లగా ఉండడంతోపాటు మట్టిలో ఉన్న రసాయన పదార్థాలు అందులోని సూక్ష్మక్రిములను సంహరిస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఫ్రిజ్‌లు ఇంట్లో వాడినా ఇప్పటికీ రంజన్ నీళ్లను మాత్రమే తాగుతున్నాం.

**- మ్యాడారం రాములు (రిటైర్డ్ టీచర్)**

### సురాయిలు కనపడ్తలేవు



మేం కాలేజీ రోజుల్లో ఉన్నప్పుడు సురాయిల్లో నీటిని నింపుకొని తాగేది. పెద్ద కుటుంబాలు ఉన్న ఇండ్లల్లో పెద్దపెద్ద కుండలు, కొంత ఆర్థిక పరిస్థితి బాగున్న వాళ్లు రంజన్లు వాడేది. విద్యార్థుల గదుల్లో మాత్రం సురాయిలే ఉండేది. సింహం మూతి ఆకారంలో సురాయిలు అందంగా కనిపించేవి. జానపద చిత్రాల్లో రాజులు సురాయిల్లో నీళ్లు పోసుకొని తాగినట్లుగా మేం సురాయిల్లో నీళ్లు పొసుకొని తాగి ఫీలయ్యే వాళ్లం. కాలం మారింది. ఫ్రిజ్‌లు, కూలర్లే కనిపిస్తున్నాయి. అయినా రంజన్లలో చల్లగైన నీటిని మించిన నీరు లేదు. మట్టివాసనతో కూడిన చల్లని నీటిని తాగితే కలిగే తృప్తే వేరు.

**- డాక్టర్ మామిడిపెల్లి సత్య ప్రకాశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (జగిత్యాల)**



# ఎండ @40 డిగ్రీలు

### దంచి కొడుతున్న భానుడు



ఎండలు దంచి కొడుతున్నాయి. రెండు రోజులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 40 డిగ్రీల అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 28 డిగ్రీలుగా ఉంటున్నాయి. ఉదయం పది గంటలకే మొదలవుతున్న ఎండ మధ్యాహ్నం వరకు క్రమంగా పెరుగుతోంది. పగలంతా వేడి గాలులు వీస్తున్నాయి. దిన దినం హీటెక్కుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారయంత్రాంగం సూచిస్తోంది. మార్చి నెలాఖరులో ఒకట్రెండు రోజులు మినహా అత్యధిక ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు దాటలేదు. ఇప్పుడు 40 డిగ్రీలు నమోదైతే మున్ముందు పరిస్థితి ఎలా ఎంటుందో అర్థం చేసుకోవచ్చు.

**- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్**

## విద్యుదుత్పత్తిలో ఎన్టీపీసీ మైలురాయి



జ్యోతినగర్, ఏప్రిల్ 1: రామగుండం ఎన్టీపీసీ 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను విద్యుదుత్పత్తిలో కీలక మైలురాళ్లను అధిగమించింది. నిర్దేశిత వార్షిక లక్ష్యాన్ని చేరుకున్నది. గతేడాది తొలియూనిట్, ఈ యేడాది రెండో యూనిట్‌తో అందుబాటులోకి వచ్చిన 1600మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఈ మార్చి 29 నాటికి 37.12 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి నమోదు చేసింది. అలాగే 2600మెగావాట్ల ఎన్టీపీసీ ప్లాంటులో మార్చి 26 నాటికి 16,645 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. అందులోని ఏడో యూనిట్ రికార్డు స్థాయిలో 305 రోజుల పాటు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం కొనసాగి ఎన్టీపీసీ వ్యాప్తంగా రెండోస్థానంలో నిలిచింది. అలాగే ఎన్టీపీసీ రిజర్వాయర్‌లోని 100మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు వార్షిక లక్ష్యాన్ని అధిగమించింది. 164.21 మిలియన్ యూనిట్లకుగాను 196.17 మిలియన్ యూనిట్ల విద్యుత్ నమోదుతో 15.58శాతం అధిక ఉత్పత్తిని సాధించింది. ఏడేండ్లుగా ఈ ప్లాంటులో 100.4శాతం పీఎల్ఎఫ్ నమోదు అవుతున్నది.

## సంజయ్‌కు ఎంపీ దామోదర్‌రావు పరామర్శ



జగిత్యాల, ఏప్రిల్ 1: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తండ్రి హన్మంతరావు ఇటీవల మరణించగా, సోమవారం వారి కుటుంబసభ్యులను రాజ్యసభ సభ్యుడు, 'నమస్తే తెలంగాణ' సీఎండీ దీవకొండ దామోదర్‌రావు పరామర్శించారు. జగిత్యాల హౌసింగ్ బోర్డులోని నివాసానికి వెళ్లి సంజయ్‌తో మాట్లాడారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

## లేగదూడకు బారసాల



సారంగాపూర్, ఏప్రిల్ 1 : బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన బైరవేని సత్యనారాయణగౌడ్ తన ఇంట్లో ఆవుకు జన్మించిన లేగదూడకు సోమవారం బారసాల వేడుక నిర్వహించారు. లేగదూడ పుట్టి సోమవారానికి 21 రోజులు కాగా, బారసాల వేడుకను ఘనంగా నిర్వహించి రేణుక అనే పేరును నామకరణం చేశారు. అంతక ముందు కూడా లేగకు బారసాల కార్యక్రమం నిర్వహించారు. మనుషులనే పట్టించుకోని ఈరోజుల్లో ఓ లేగదూడకు బారసాల నిర్వహించి నామకరణం చేయడం అభినందనీయమని పలువురు సత్యనారాయణను అభినందించారు.